క్లుప్తంగా

నల్లారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



నల్లారెడ్డి పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: జెడ్పీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లారెడ్డి (80) మృతి పార్టీకి తీరనిలోటని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం నల్లారెడ్డి అంత్యక్రియలు మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యులను విప్ పరామర్శించారు. అనంతరం ఆయన నల్లారెడ్డి పాడెను శ్మశానం వరకూ మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్ గాదిలింగ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బసవరాజు, కోటేశ్వర రెడ్డి, బసవరాజు, వీరన్నగౌడ్ పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

కుందుర్పి: పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కంబదూరు ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ హెచ్చరించారు. గురువారం మండలంలోని వడ్డెపాళ్యం, మాయదార్లపల్లి, మలయనూరు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు.ఆయా కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేసి పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన విధివిధానాలను సిబ్బందికి వివరించారు. సీడీపీఓ వెంట ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ముత్యాలరెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన సప్తాహ యజ్ఞం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో ఉన్న శాంతానంద ఆశ్రమంలో ద్వితీయ భాగవతసప్తాహ యజ్ఞ కార్యక్రమం గురువారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం ఈశ్వరీదేవి, సద్గురు శాంతానాందస్వాములకు ప్రత్యేక పూజలతోపాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత సప్తాహ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీరామ అష్టోత్తర శతనామావళి, గురుపాద స్తోత్రం, గురుస్తోత్రం, మంత్రపుష్పం, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆశ్రమ పీఠాధిపతి గురుసేవానందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఒగ్గుసేవ'



ఒగ్గుసేవ నిర్వహిస్తున్న గొరవయ్యలు

ఉరవకొండ: గవిమఠం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్న గొరవయ్యల ఒగ్గుసేవ కార్యక్రమం గురువారం ఆకట్టుకుంది. కురుబల ఆచారాన్ని గౌరవిస్తూ కార్యక్రమంలో గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి పాల్గొన్నారు. గుంతకల్లు రోడ్డు నుంచి గొరవయ్యలు సంప్రదాయ నృత్యం చేసుకుంటూ గవిమఠానికి చేరుకుని సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి పాలు తాగారు. అనంతరం పాలు, పండ్లను భక్తులకు పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాల్లో ఉచిత వైద్య శిబిరం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో గవిమఠం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సాహితి, వినీతా మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరం వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు నిమ్మల వెంకటేష్, మోతీలాల్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ మమత, సులోచన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత మృతి

కూడేరు: మండలంలోని కరుట్లపల్లికి చెందిన కురుబ గౌతమి(27) బుధవారం విషరసాయనం తాగి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశులు తెలిపారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దానిమ్మ పంట దగ్ధం

బొమ్మనహాళ్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 30 ఎకరాల దానిమ్మ పంట దగ్ధమై రూ.50 లక్షల నష్టం జరిగింది. మండలంలోని ఎల్బీనగర్‌కు చెందిన శివప్రసాదరావుకు సంబంధించిన 40 ఎకరాలను అదే గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశులు కౌలుకు తీసుకొని దానిమ్మ పంట సాగు చేశాడు. గురువారం సాయంత్రం పొలంపై వెళ్లిన విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురవ్వలు కింద ఎండిన గడ్డిపై పడ్డాయి. మంటలు వ్యాపించి దాదాపు 30 ఎకరాల్లో ఉన్న చెట్లన్నీ కాలిపోయాయి. దీంతో రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరాడు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు





కళ్యాణదుర్గం: ఓటరు స్లిప్పులను వేరుచేయడాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ నిషాంత్ రెడ్డి. బ్రహ్మసముద్రంలో ఓటరుకు స్లిప్పులను అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు స్లిప్పుల పంపిణీ
- ఓటు హక్కు వినియోగంపై నేడు అవగాహన సదస్సులు

కళ్యాణదుర్గం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు స్లిప్పులు అందించేందుకు కసరత్తు ప్రారంభించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కళ్యాణదుర్గం డివిజన్‌లోని ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు స్లిప్పులను పోలింగ్ బూత్‌ల వారీగా వేరు చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో స్లిప్పులను ఓటర్లకు అందజేయాలని ఆర్డీఓ నిషాంత్ రెడ్డి ఆదేశించారు. కాగా కళ్యాణదుర్గం డివిజన్లో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 13,215 మంది ఉండగా, 756 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. డివిజన్ వ్యాప్తంగా 26 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీలు నాగరాజు, వెంకటేశులు, శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ నిషాంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అన్ని మండలాల్లో అధికారులు సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరూ సదస్సుకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కల్పించాలని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులకు ఆర్డీఓ సూచించారు.

నేడు అవగాహన సదస్సు

కళ్యాణదుర్గం/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట/కూడేరు/బెళుగుప్ప: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఓటు హక్కు ఉన్న వారందరూ హాజరు కావాలని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుమ్మఘట్ట, ఎంపీడీఓలు బాలాజీ, కొండయ్య, శ్రీనివాసులు, కూడేరు తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. అలాగే బెళుగుప్ప మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణమంటపంలో శుక్రవారం గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీఓ యాదేవేంద్ర, ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు.

బొమ్మనహాళ్‌లో రేపు..

బొమ్మనహాళ్: స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈనెల 6న దర్గాహొన్నూరులో ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: పట్టభద్రుల , ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పూలకుంట గ్రామంలో వైఎస్సార్ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుని సైనికుల్లా పని చేసి మన సత్తా ఏమిటో నిరూపించాలన్నారు.రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని సూచించారు. నాడు నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌సెంటర్లు, శీతల గిడ్డంగులను నెలకొల్పి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు కలుపుకుని 6.16 లక్షల ఉద్యోగాలు సీఎం ఇచ్చారని గుర్తుచేశారు. కనుమరుగయ్యే టీడీపీని నమ్మేస్థితిలో యువత లేదన్నారు. చంద్రబాబును, ఎల్లో మీడియాను జనం ఛీకొడుతున్నారన్నారు. వెన్నుపోటు చంద్రబాబును, జిత్తులమారి కాలవ శ్రీనివాసులును మరోసారి నమ్మి మోసపోలేమని అనేక మంది విద్యావంతులు వాపోతున్నారన్నారు. గతంలో నిరుద్యోగులు, ఉద్యోగులను అనేక రకాలుగా మోసం చేసిన టీడీపీ నాయకులకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. మేలు చేసే ప్రభుత్వాన్ని ఆదరించి అండగా ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి, ఎంవీ రామచంద్రారెడ్డికి వేయించి అఖండ మెజారిటీతో గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, ఎంపీపీ భారతి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, మండల కన్వీనర్ మంజునాథ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వెన్నపూస సంజీవరెడ్డి, రాయదుర్గం మండల కన్వీనర్ మల్లికార్జున, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు గౌని కాంతారెడ్డి, అశ్వర్థరెడ్డి, నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, అనిల్,రాజేష్ , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉమా.. ప్రజలు నిన్ను నమ్మరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.

శెట్టూరు: కళ్యాణదుర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడిని ప్రజలు విశ్వసించరని, ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రజలు, కాంట్రాక్టర్లు, బ్యాంకులను మోసగించిన విషయం ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న, నాయకులు ముత్యాలు, వన్నూరుస్వామి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మంపల్లిలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బళ్లారికి చెందిన ఒక మహిళ తన భర్తతో కలిసి చేసిన పలు కాంట్రాక్టు పనుల్లో తెలుగుదేశం ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు డబ్బులివ్వకుండా మోసం చేస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నాడంటూ ఏకంగా టీడీపీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన విషయాన్ని గుర్తుతెచ్చుకోవాలన్నారు. ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించని వ్యక్తి.. ప్రజలను ఉద్ధరిస్తానంటూ ఇదేం కర్మ కార్యక్రమంలో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందన్నారు. లక్ష్మంపల్లి పంచాయతీలోని ఎర్రబోరేపల్లిలో మరియమ్మకు రూ.2,700 ఇచ్చి' చంద్రన్న స్ఫూర్తితో ఉమన్న సహాయం' అంటూ డ్రామాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు. నిజానికి ఒక్క లక్ష్మంపల్లి పంచాయతీలో ప్రతి నెలా రూ.15.60 లక్షలు వైఎస్సార్ పెన్షన్ కానుక ప్రభుత్వ అందిస్తోందన్నారు. మరియమ్మకు వికలత్వం ఉండటంతో సచివాలయ ఉద్యోగులు గుర్తించి సదరం క్యాంప్‌లో హాజరుకు పేరు నమోదు చేసి వివరాలను అందజేశారని గుర్తుచేశారు. అయితే సదరం క్యాంప్‌కు వెళ్లకపోవడం, అధికారులు, వలంటీర్లకు సహకరించలేకపోవడంతో మరియమ్మకు పింఛన్ అందలేదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హిమాంవలీ, శ్రీనివాస్ రెడ్డి, రామలింగా రెడ్డి, వెంకటరమణ, ధనుజయ యాదవ్, గజ్జి వన్నూరుస్వామి, నారాయణప్ప, మహేష్, మర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

కూడేరు: వైఎస్సార్ సీపీ పశ్చిమ రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ నారాయణ రెడ్డి , సచివాలయాల మండల కన్వీనర్ దేవేంద్ర అభ్యర్థించారు. గురువారం కూడేరులో వెన్నపూసకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి వారు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సచివాలయ కన్వీనర్లు బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఎర్రిస్వామి, గంగాధర్, సూర్యనారాయణ, విజయభాస్కర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తోపుదుర్తి రామాంజినేయులు, శివ, గోవింద్, నాగిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కణేకల్లు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరిలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని 43ఉడేగోళం, బ్రహ్మసముద్రం, బెణికల్లు గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ యంత్రకాయల వన్నూరప్ప, మాజీ సర్పంచులు పాటిల్ ప్రభాకర్‌రెడ్డి, కురుబ లోకేష్‌గౌడ్, గిర్రప్పరెడ్డి, పాటిల్ రామలింగారెడ్డి, నగేష్‌రెడ్డి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రమావత్‌దేవి

వజ్రకరూరు: సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీపీ రమావత్ దేవి, ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను తహసీల్దార్ అనిల్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులు విధినిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, సర్పంచులు జయేంద్రరెడ్డి, మోనాలిసా, సురేంద్ర, ఉమామహేశ్వరి, ధనలక్ష్మి, భూమా కమలమ్మ, శివాజీనాయక్, జ్యోతిబాయి, బాల్యం సుంకులమ్మ, కురుబ లక్ష్మయ్య, ఎంపీటీసీలు నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, మునయ్య, పాపన్న, నారాయణస్వామి, పెన్నోబులేసు, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్న గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదల సొంతింటి కల సాకారం



జగనన్న కాలనీలో ఇల్లు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కూడేరులోని జగనన్న కాలనీలో మంగళ లక్ష్మీనారాయణ, ఇతర లబ్ధిదారుల ఇళ్లను గురువారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలకే ఇళ్లు మంజూరయ్యేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లక్షల మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరిట రూ.లక్షల విలువ చేసే స్థలాన్ని కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించి పేదల సొంతింటి కలను నెరవేరుస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పోటాపోటీగా సాగిన దుకాణం వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

కూడేరు: స్థానిక శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద టెంకాయలు , ఇతర పూజా సామగ్రిని విక్రయించే దుకాణం ఏర్పాటుకు గురువారం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఎక్కువ మంది పోటీ పడడంతో వేలం పోటాపోటీగా సాగింది. కాగా రూ.3,37000కు వేలం పాడి జానకమ్మ దుకాణం ఏర్పాటుకు అనుమతులు దక్కించుకుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆలయానికి ఆదాయం రూ.23, 000 పెరిగినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు తెలిపారు.. అదే విధంగా సప్లయర్స్ నిర్వాహణను కూడా జానకమ్మనే రూ.63 వేలకు దక్కించుకుందని ఆయన తెలిపారు. వేలం సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు మేలుచేసేలా పనిచేయండి

వజ్రకరూరు: రైతులకు మేలు చేసేలా పనిచేయాలని ఉరవకొండ ఏడీఏ పద్మజ సూచించారు. గురువారం మండలంలోని వజ్రకరూరు, తట్రకల్లు తదితర గ్రామా ల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ-కేవైసీ తదితర వాటిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే ఉరవకొండ డివిజన్ పరిధిలో పప్పుశనగ విక్రయాలకు సంబంధించి 406 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. త్వరలో పప్పుశనగ కొనుగోలు చేస్తామన్నారు. మండల ఏఓ శ్రీనివాస్, ఎంపీఈఓ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పడదాం



చిత్రలేఖనంలో ప్రతిభ చాటిన వారిని అభినందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేద్దామని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ అన్నారు. స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా నీటి పొదుపు ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో వర్షపు నీటిని ఆదా చేసుకోవాలన్నారు. నీటిని పొదుపు చేయాలన్నారు. నీటి విలువ తెలియక కొందరు వృథా చేస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అన్నారు. అనంతరం నీటి ఆవశ్యతపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, ప్రతిభ చాటిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీఎల్ కాంతారావు, నెహ్రూ యువ కేంద్ర అధికారి శ్రీనివాసులు, ఆదర్శ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ కానుకతో ధీమా

శెట్టూరు: వైఎస్సార్ పింఛన్ కానుకతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, రోగులకు జీవితంపై ధీమా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్న, నాయకుడు ముత్యాలు, వన్నూరుస్వామి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మంపల్లిలో చోటు హుసేన్ మంచానికే పరిమితమై జీవనం నెట్టుకొస్తున్నాడు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం ద్వారా హుసేన్‌కు నూతన పింఛన్ మంజూరయ్యేలా చేశారు. గురువారం నాయకులు, అధికారులు కలిసి లబ్ధిదారుడికి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, ప్రసాద్, వెంకటరమణ, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

కుందుర్పి: మండలంలోని నిజవల్లి, కుందుర్పి, తెనగల్లు, కరిగానిపల్లి తదితర పంచాయతీల్లో రెండు రోజులుగా 3 వేల పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు స్థానిక పశు వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. తమ సిబ్బంది మూడు గ్రూపులుగా విడిపోయి మండలంలోని 36 గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు.

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్, ఉంతకల్లు క్రాస్ గ్రామాల్లో గురువారం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాల ప్రత్యేక కార్యక్రమాన్ని పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 250 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆ సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, సీఈఓ ముత్యాలప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతూ కేవైసీ చేయించుకోవడంతో పాటు ఈ నెల 31 లోపు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అలాగే సంఘంలో నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం , బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్‌లు, నాలుగు పాస్ ఫోటోలు అందజేయాలన్నారు.

వేధింపుల కేసు నమోదు

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం తాండాకు చెందిన తిరుపాల్‌నాయక్, అతడి తల్లిదండ్రులు మంగమ్మబాయి, రమేష్‌నాయక్‌పై వరకట్న వేధింపుల కింద గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీత తెలిపారు. వరకట్నం తేవాలని ఏడాదిగా వేధింపులకు గురిచేస్తుండడంతో .. మనోవేదనను తట్టుకోలేక బాధితురాలు జ్ఞానేశ్వరిబాయి భర్త తిరుపాల్‌నాయక్, అత్తమామలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో గృహహింస చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

ఆడపిల్ల చదువు అవనికి వెలుగు



గుమ్మఘట్ట: మాట్లాడుతున్న వైద్యుడు బాలాజీనాయక్

ఉరవకొండ రూరల్: ఆడపిల్ల చదువుకుంటే దేశానికే వెలుగునిస్తుందని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నముస్టూరు మోడల్ స్కూల్లో బేటీ బఛావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రశస్తకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎండీ షఫీ, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

కూడేరు: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని..గర్భంలోనే ఆడపిల్లలను చంపేయవద్దని సీహెచ్ఓలు మోహన్ బాబు, వరలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఉమాదేవి సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీలో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ, ఏఎన్ఎంలు చంద్రకళ, సుశీల, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

బొమ్మనహాళ్: మాతాశిశు మరణాలు అరికట్టాలంటే, బాల్య వివాహాలు నిర్మూలించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి సూచించారు. మండలంలోని శ్రీధరఘట్టలో బాల్య వివాహాలు చేయడంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడంతో ప్రసవం సమయంలో పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, భారతి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆడపిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

గుమ్మఘట్ట: మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించి విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపాలని పీహెచ్‌సీ వైద్యుడు బాలాజీనాయక్ సూచించారు. మండలకేంద్రంలోని ఎంజేబీ గురుకుల విద్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల, బీటీపీలో ఉన్న కేజీబీవీలో బేటీ బచావో బేటీపఢావోపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. చిన్నతనంలో బాల్యవివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. దిశాచట్టం, పోక్సో చట్టం, గర్భస్థ లింగనిర్ధారణ చట్టం, పౌష్టికాహారం గురించి విద్యార్థులకు తెలియచేసి చైతన్యం తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు రవికుమార్, ఆదిబయమ్మ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లు సుప్రజ, రత్నమ్మ, హెచ్ఎం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.